క్లుప్తంగా

పరామర్శ



నివాళి అర్పిస్తున్న పుట్ట మధు తదితరులు

రామగిరి: టీబీజీకేఎస్ ఆర్జీ–3 డివిజన్ మాజీ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య తల్లి అమృతమ్మ ఇటీవల మృతిచెందగా.. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో నివాళి అర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, నాయకులు కాపురబోయిన భాస్కర్, వేగోలపు మల్లయ్య, దేవ శ్రీనివాస్, బుర్ర ముత్యాలు, అసం తిరుపతి తదితరులున్నారు.

ఓదెల: ఓదెల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ భూసారపు చిరంజీవి కుటుంబానికి స్థానిక బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ సతీశ్ 50 కిలోల బియ్యం వితరణ చేశారు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గోదావరిఖని: ఇటీవల జీడీకే–2వ గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఇద్దరు కార్మికులను శుక్రవారం ఏఐటీయూసీ నాయకులు పరామర్శించారు. హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు నోయల్, సంపత్‌ను ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఎల్కలపల్లి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రభావిత ఎల్కలపల్లి గ్రామాభివృద్ధికి సీఎస్సార్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ సర్పంచ్ చిట్టబోయిన రాజ్‌కుమార్‌యాదవ్ శుక్రవారం పరిపాలనా భవనంలోని సీఎస్సార్ అధికారి చంద్రకు వినతి పత్రం అందించారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని, వీధి దీపాలు, శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

ఉద్యోగికి సన్మానం

సుల్తానాబాద్‌రూరల్: చిన్నకల్వల గ్రామంలో పశు వైద్యురాలిగా, గ్రామ ప్రత్యేకాధికారిణిగా సేవలందించిన డాక్టర్ శైలజ బదిలీపై వెళ్తుండగా.. శుక్రవారం గ్రామస్తులు, నాయకులు ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌రావు, మండల పశు వైద్యాధికారి రఘుపతిరెడ్డి, వెటర్నరీ అధికారి కుమారస్వామి, సీఈవో రమేశ్, కార్యదర్శి రణధీర్, మాజీ సర్పంచ్ రమేశ్, బీఆర్ఎస్వీ యువ నాయకుడు సాయివంశీ ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలి

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి పలు తీర్మానాలు చేశారు. నాంపల్లి రమేశ్, మచ్చగిరి రాము, మల్లారపు అరుణ్‌కుమార్, కుమార్, విశ్వతేజ, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

సుల్తానాబాద్: ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏబీవీపీ జిల్లా విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసురి ప్రవీణ్ కోరారు. శుక్రవారం హాస్టళ్లను సందర్శించారు. సుల్తానాబాద్‌లో మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురుకులాలు, మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే హాస్టళ్లలో సన్న బియ్యం పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని పర్యవేక్షించే అధికారి కరువయ్యారని ఆరోపించారు.

అందుబాటులో పోస్టల్ సేవలు

ఫెర్టిలైజర్‌సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోస్టాఫీస్ పథకాలను పేద, మధ్యతరగతి కుటుంబాలకు చేయూతనిచ్చేలా అందుబాటులో ఉంచడానికి శుక్రవారం తపాలా శాఖ ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ హౌసింగ్ సొసైటీ ఆఫీస్‌లో పోస్టల్ శాఖ సేవలపై డాక్ చౌపాల్‌ను నిర్వహించారు. గోదావరిఖని సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడారు. పోస్టాఫీసు పథకాలైన సేవింగ్స్ అకౌంట్స్, రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా, ఆక్సిడెంటల్ పాలసీ పథకాలను వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గోదావరిఖని: సీజనల్ వ్యాధులతో అందరూ అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఆర్జీ–1 ఆరోగ్య శాఖ అధికారి సుమన్ సూచించారు. జీడీకే–1, 3 గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో అనారోగ్యాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్మికులకు సూచించారు. నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటినిల్వలతో దోమలు వృద్ధిచెంది చికున్ గున్యా, డెంగీ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. వర్షంలో వెళ్లాల్సి వస్తే తప్పకుండా రెయిన్‌కోట్ గొడుగు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

ఇరుకు రోడ్లకు చెల్లు

- అక్రమ నిర్మాణాల కూల్చివేత
- రోడ్ల నిర్మాణం, వెడల్పు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి పాలకవర్గం కసరత్తు

సుల్తానాబాద్: ఇరుకు రోడ్లతో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పాలకవర్గం చర్యలు చేపట్టింది. రోడ్లను ఆక్రమించుకొని నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తోంది. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ల వెడల్పుతో పాటు డ్రైనేజీ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్‌గా ఆవిర్భవించి నాలుగున్నరేళ్లు కావడంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండేందుకు రోడ్ల సుందరీకరణకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు కాలనీలను సందర్శించి రోడ్డు వెడల్పు చేయాలని అధికారులను ఆదేశించారు.

రోడ్ల వెడల్పుతో రవాణా సౌకర్యం మెరుగు

రోడ్లను విస్తరించడంతో ప్రజలకు రవాణా సౌకర్యం, ప్రమాదాల నివారణకు తోడ్పడుతుందని పాలకవర్గం, అధికారులు భావిస్తున్నారు. పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉండడంతో రెండు వాహనాలు ఎదురుగా వస్తే ఇబ్బందులు పడుతున్నారు. వాటిని నివారించేందుకు భవిష్యత్ అవసరాల కోసం రోడ్డు వెడల్పు చేస్తున్నారు.

నోటీసులు ఇచ్చి కూల్చివేస్తే బాగుండేది..

ఇంటి యజమానులకు నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ పరిధిలో ఉన్న పలు కాలనీల్లో రోడ్డు వెడల్పు కోసం ఇళ్లు కూల్చివేయడం భావ్యం కాదని స్థానికంగా ఆరోపణలు వినవస్తున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత మున్సిపల్ సిబ్బంది కూల్చివేస్తే ఎవరూ ఇబ్బంది పడేవారు కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇంట్లో లేనప్పుడు సైతం కూల్చివేశారని వాపోతున్నారు.

వ్యాపారం మూడు వీధుల్లోనే..

పట్టణంలో వ్యాపారమంతా మూడు కూడళ్లలోనే జరుగుతుంది. రాజీవ్ రహదారి వెంబడి, కాల్వశ్రీరాంపూర్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ వీధుల వెంబడి మాత్రమే వ్యాపారం జరుగుతుంది. ముఖ్య వీధులను విస్తరణ చేయడంతో పట్టణమంతా వ్యాపారం విస్తరించే అవకాశం ఉందని, దీనికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

నిధులు మంజూరు

రోడ్ల విస్తరణతో ప్రజలకు మేలు జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. పట్టణంలోని చెరువు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రహదారికి రూ8లక్షలు, డ్రైనేజీకి రూ.31లక్షలు, పూసాల చెరువు వరకు రూ.2కోట్లు, డ్రైనేజీలకు రూ.54లక్షలు, సుల్తానాబాద్ నుంచి గట్టెపల్లికి వెళ్లే రహదారికి రూ.2కోట్ల50లక్షలు, సుల్తానాబాద్ నుంచి నీరుకుల్లకు రూ.6కోట్లు నిధులు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి.



రోడ్డును ఆక్రమించిన స్థలాల కూల్చివేత
రోడ్డును ఆక్రమించుకున్న వాటిని కొలుస్తున్న సిబ్బంది

ప్రజలందరూ సహకరించాలి



సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారింది. మున్సిపల్‌కు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు నిధులు మంజూరు చేశారు. టెండర్ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. మరి కొన్ని ప్రారంభించాల్సి ఉంది. దీనికి అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపారులు, ప్రజలందరూ సహకరించాలి. – గాజుల లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, సుల్తానాబాద్

ఇబ్బంది కలగకుండా..



భవిష్యత్ తరాలకు సౌకర్యంగా ఉండేందుకే అక్రమ నిర్మాణాలను తొలగించి డ్రైనేజీలు రోడ్లు నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో భూముల విలువ అధికంగా పెరిగే అవకాశం ఉంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు వెడల్పు చేస్తున్నాం. ప్రజలు, ఇంటి యజమానులు సహకరించాలి. – కట్ల వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్, సుల్తానాబాద్

కార్యవర్గం ఎన్నిక



ముత్తారం: కార్యవర్గ సభ్యులు

ముత్తారం: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం ఎన్నికలు శుక్రవారం ముత్తారంలో జరిగాయి. అనుము వీరాస్వామికి 11 ఓట్లు రాగా, 13 ఓట్లతో వైద్య రాజేందర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాజేందర్, ప్రధాన కార్యదర్శి తిర్రి శ్రీనివాస్, కోశాధికారి సముద్రాల రాజేందర్‌కు నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు రెడ్డి భాస్కర్ అందజేశారు. ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూలపల్లి: ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్, వైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో గౌరవాధ్యక్షుడిగా కొట్టె సంజీవ్, అధ్యక్షుడిగా గొడిసెల రాంచంద్రం, ఉపాధ్యక్షుడిగా రవి, కార్యదర్శిగా మల్లారపు శంకరయ్య, సహాయ కార్యదర్శిగా గడ్డం కమలాకర్, కోశాధికారిగా నల్లల సంపత్, ప్రచార కార్యదర్శిగా మల్లారపు కిశోర్, సభ్యులుగా సత్యనారాయణ, అరుణ్‌కుమార్, రాజేశం ఎన్నికయ్యారు.

దరఖాస్తు చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: నూతనంగా పట్టా పాసు పుస్తకం పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని విస్తరణ అధికారి కదారి ప్రశాంత్ కోరారు. జూన్ 18 వరకు కొత్త పట్టా పాసు పుస్తకం పొందినవారు అర్హులని, 18–59 లోపు వయస్సుండాలని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సంబరాలు



గోదావరిఖనిటౌన్: సంబరాలు జరుపుకుంటున్న న్యాయవాదులు

గోదావరిఖని: ఎస్సీ వర్గీకరణ అణగారిన వర్గాలకు పండుగ రోజని బీజేపీ రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. నాయకులు రమేశ్, బాణాల స్వామి, గోపగాని నవీన్‌గౌడ్, గుండబోయిన భూమన్న, మిట్టపల్లి సతీశ్, సుల్వ లక్ష్మీనారాయణ, కోమల మహేశ్, మచ్చ విశ్వాస్, పిడుగు కృష్ణ, బియ్యాల మహేశ్, పెండెం సత్యనారాయణ, రాకేశ్, కొమ్ము స్వామి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ శుక్రవారం గోదావరిఖని కోర్టు ముందు మాదిగ లాయర్స్ ఫెడరేషన్ నాయకుడు పెద్దెల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, సీహెచ్ శైలజ, సిరిగ సంజయ్‌కుమార్, శీతకారి శేఖర్, పెరిక మనోహర్, ఇరుగురాల సంతోష్, పులిపాక ప్రవీణ్, కాదాసి శేఖర్, ఇరుగురాల మహేందర్, దూడపాక లింగయ్య, తిలక్, గజ్జల ప్రసన్న, కల్యాణి, ప్రవళిక, సౌజన్య, మాట్ల భాను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో చంద్రబాబు నాయుడు, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు కోటగిరి పాపయ్య మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: ప్రధాని మోదీ, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఆనంద్, జంగ చక్రధర్‌రెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్, మనోహర్, రాజవీరు, సంతోష్, రమేశ్, కొమురయ్య, మల్లేశ్ తదితరులున్నారు.

ఎలిగేడు: ఎస్సీ వర్గీకరణకు కోర్టు అనుమతులివ్వడంతో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేశారు. ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నారాయణ, కొండయ్య, వినోద్, దుర్గయ్య, చంద్రయ్య తదితరులున్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక ఎస్సీకాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాదిగ సామాజికవర్గ నాయకుడు మానుమండ్ల శ్రీనివాస్ మాట్లాడారు. కుల పెద్దలు నెరువట్ల సాగర్, గంగయ్య, మానుమండ్ల భూమయ్య తదితరులున్నారు.



జూలపల్లిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న మాదిగ నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: నారాయణపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు కల్లెపల్లి దేవేందర్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టారు. మాజీ ఎంపీటీసీ రమేశ్, కొండాల్‌రావు, సది తదితరులున్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కుక్క రవి, చంద్రమౌళి, చిప్పకుర్తి సత్యనారాయణ, నక్క శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సింగరేణి మాదిగ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కన్వీనర్ దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఆకునూరి రాజయ్య, ఆసన్న, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



కాల్వశ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

కాల్వశ్రీరాంపూర్: పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు శుక్రవారం తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమ సమాచారం మేరకు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులను గురువారం రాత్రి ముందస్తు అరెస్టు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అరెస్టు చేసి వదిలేశామని ఎస్సై ఓంకార్‌యాదవ్ తెలిపారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసర్ల తిరుపతిరెడ్డి మాట్లాడారు. గంగారం, ఇప్పలపల్లె, జాఫర్‌ఖాన్‌పేట్, పందిల్ల, కిష్టంపేట, మొట్లపల్లి మాజీ సర్పంచులున్నారు.

జూలపల్లి: ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో అబ్బాపూర్ మాజీ సర్పంచ్ ఈర్ల మల్లేశం, బాలరాజుపల్లె మాజీ సర్పంచ్ కుంటూరి రాజయ్యను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

సుల్తానాబాద్‌రూరల్: మాజీ సర్పంచులు మోహన్‌రెడ్డి, కొయ్యడ స్వప్న, శ్రావణ్‌కుమార్ తదితరులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఓదెల: సెక్రటేరియట్‌కు తరలివెళ్లిన వారిలో మాజీ సర్పంచులు ఆళ్ల రాజిరెడ్డి, పల్లె ఓదెలు, కర్క మల్లారెడ్డి, కొట దామోదర్‌రెడ్డి, తిప్పారపు చిరంజీవి, రవి, పత్తి సమ్మిరెడ్డి, శ్రీనివాస్, గోవిందుల ఎల్లస్వామి ఉన్నారు.

తల్లి పాల వారోత్సవాలు



ర్యాకల్‌దేవ్‌పల్లిలో ర్యాలీ

ఎలిగేడు: ర్యాకల్‌దేవ్‌పల్లిలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టారు. పౌష్టికాహారం, తల్లి పాల ప్రాముఖ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ ఓదేశ్వరి, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి, ముర్రు పాల ప్రాముఖ్యంపై మహిళలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి బిడ్డకు పాలిస్తే ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ సావిత్రి, కాల్వశ్రీరాంపూర్ పీహెచ్ఎన్‌వో భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సుమలత, రజిత, హాజీర, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: శివరాంనగర్‌లోని ఉప్పర్లకేసారం అంగన్‌వాడీ పాఠశాలలో సూపర్‌వైజర్ పల్లె అనిత తల్లి పాల ప్రాముఖ్యంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ ఎం.స్వరూప, ఆశ కార్యకర్త సుమలత తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ: రెండేళ్ల వయస్సు వరకు పిల్లలకు తప్పనిసరిగా తల్లి పాలే ఇవ్వాలని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ సూచించారు. ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పండ్లు పంపిణీ చేశారు. ఆర్ఎంవో అరుణ, వాణిశ్రీ, నర్సింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో మాల మహానాడు నిరసన



నినాదాలు చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జాతీయ మాల మహానాడు గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గోదావరిఖని శాఖ అధ్యక్షుడు పిట్టల వెంకటి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు విరుద్ధంగా రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని అన్నారు. నాయకులు నంది గణేశ్, ఎరుకల లింగమూర్తి, నూకల మొండయ్య, దాసరి రామస్వామి, కొండ కుమార్, ఎరుకల లక్ష్మణ్‌రావు, దాసరి రమేశ్, శీలం వెంకటి, సోగాల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి



కాల్వశ్రీరాంపూర్‌లో రాస్తారోకో చేస్తున్న పలు గ్రామాల వాసులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ మహేందర్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పలు గ్రామాల వాసులు శుక్రవారం తహసీల్ కార్యాలయం సమీపంలో కాల్వశ్రీరాంపూర్–సుల్తానాబాద్ ఆర్అండ్‌బీ రహదారిపై రాస్తారోకో చేశారు. సుమారు రెండు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు వారిని శాంతింపజేశారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..



జిల్లా అధికారి నుంచి రిజిస్ట్రేషన్ కాపీ అందుకుంటున్న మత్స్యకారులు

సుల్తానాబాద్‌రూరల్: గొల్లపల్లి గ్రామంలోని మత్స్యకారులంతా ఒకటై మార్కెటింగ్ చేయాలనే ఉద్దేశంతో 30 ఏళ్ల క్రితం సంఘం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఎట్టకేలకు వారి కల నెరవేరింది. గొల్లపల్లి మత్స్యకారుల మార్కెటింగ్ కో–ఆపరేటివ్ సొసైటీగా రిజిస్టర్ కాగా.. ఆ రిజిస్ట్రేషన్ కాపీని జిల్లా మత్స్యకార అధికారి భాస్కర్, ఫీల్డ్ ఆఫీసర్ హరీశ్ చేతుల మీదుగా మత్స్యకారులు అందుకున్నారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో 113 మంది మత్స్యకారులున్నారని, అందరం కలిసి కట్టుగా వ్యాపారం చేసేందుకు సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని అన్నారు.

గనిపై ఓబీ పోయడం వల్లే ప్రమాదాలు



కార్మికులతో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

గోదావరిఖని: జీడీకే–2, 2ఏ భూగర్భ గనిపై జీడీకే–5 ఓసీపీ ఓబీ మట్టి పోయడం వల్లే కుంగిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం జీడీకే–2, 2ఏ గని కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ గనులను మూసివేయాలని యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. డీడీఎంఎస్ ద్వారా గనులను మూసివేయాలని చెప్పిస్తోందని అన్నారు. ఈ గనులను సాఫ్ట్ మైన్స్‌గా మారిస్తే 7 నుంచి 10వేల మంది కార్మికులు పని చేసే అవకాశముంటుందన్నారు. డంప్ యార్డ్‌ను వేరే చోటుకు మార్చాలని డిమాండ్ చేశారు. కార్మికులను సీనియార్టీ ప్రకారం బదిలీ చేయాలని, రాజకీయ జోక్యం తగ్గించాలన్నారు. నాయకులు జక్కుల నారాయణ, ఖయ్యూం, కొమురయ్య, రాంచంద్రారెడ్డి, ప్రణబ్, కుమారస్వామి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్



బేగంపేటలో మాట్లాడుతున్న సీఐ రాజుగౌడ్

రామగిరి: గ్రామాల్లో నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంథని సీఐ బి.రాజుగౌడ్ తెలిపారు. శుక్రవారం బేగంపేట గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రామగిరి, ముత్తారం ఎస్సైలు కె.సందీప్, మధుసూదన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై స్వామి

పాలకుర్తి: ధర్మారం క్రాస్ రోడ్ వద్ద రహదారిపై వాహనదారులకు శుక్రవారం బసంత్‌నగర్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్సై స్వామి వాహనదారులకు పలు సూచనలు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, కానిస్టేబుల్ సురేశ్, ఆటో డ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ

రామగుండం: వర్షాకాలం సీజన్‌లో గ్రామాలవారీగా నిర్దేశిత మొక్కల పెంపకంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో ఎంఏ అలీం ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. రాయదండి, ఎల్లంపల్లి, టీటీఎస్ అంతర్గాం, పెద్దంపేట గ్రామాల్లో అందజేశారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో గ్రామాల్లో రహదారులకిరువైపులా మొక్కలు నాటే పనులను ఉపాధి కూలీలు ముమ్మరంగా చేపడుతున్నారు. విలేజి అంతర్గాం ప్రధాన రహదారిలో ఇరువైపులా గుంతలు తవ్వి మొక్కలు నాటుతున్నారు. ఉపాధి హామీ ఏపీవో రమేశ్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షిస్తున్నారు.

35 శాతం లాభాల వాటా చెల్లించాలి

గోదావరిఖని: గతేడాది సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. శుక్రవారం జీడీకే–2వ గని మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఇసంపెల్లి రాజేందర్, రామకృష్ణ, గుండేటి మల్లేశ్, సంబోజి రాజేంద్ర, ప్రసాద్, శేఖర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పెద్దపల్లిరూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న కారణంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలిచ్చారు. శ్రీకాంత్, సాబీర్‌ఖాన్, అజయ్, భాగ్యలక్ష్మి, శారద తదితరులున్నారు.

తల్లిదండ్రులను షోషించాలి

జ్యోతినగర్: జన్మనిచ్చిన తల్లిదండ్రులను పోషించాలని వీఏసీసీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు బియ్యాల మహేందర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని తోట వెంకట్ అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నారు. అతన్ని కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో.. సోదరుడు తోట కుమార్ ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించాడన్నారు. ఇంటికి వచ్చినా కూడా అతన్ని పోషించలేమంటూ కుటుంబ సభ్యులనడంతో.. హ్యూమన్ రైట్స్ సభ్యులను ఆశ్రయించారని తెలిపారు. కౌన్సెలింగ్ చేశామని అన్నారు. సమస్య పరిష్కారం కాలేదని, వెంకట్ వద్ద వాగ్మూలం తీసుకున్నామని, తదుపరి చర్యలకు రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ప్రతినిధులకు తెలియజేయనున్నట్లు చెప్పారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కాల్వశ్రీరాంపూర్: పల్లెల్లో పారిశుధ్యం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీపీవో ఆశాలత ఆదేశించారు. పారిశుధ్య లోపంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అదనపు కలెక్టర్ అరుణశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాలతో డీపీవో శుక్రవారం గంగారంలో పర్యటించి పరిసరాలు పరిశీలించారు. డ్రైనేజీలో చెత్త, మురుగు పేరుకుపోవడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, నీటిగుంతలు, డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, వీధుల్లో ఫాగింగ్ చేయించాలని, తద్వారా దోమలు నివారణ సాధ్యమవుతుందన్నారు. ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి షబీబుద్దీన్, ఈద జనసేన జిల్లా అధ్యక్షుడు కూస సతీశ్, మాజీ సర్పంచ్ ఈద సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: స్వచ్ఛత, పరిశుభ్రత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. మారెడుగొండలో పర్యటించారు. ఓ కిరాణ దుకాణంలో స్వచ్ఛతపై నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించారు.